క్లుప్తంగా

దేవరపల్లిలో కడప పందెం కోళ్లు


దేవరపల్లిలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న పందెం పుంజులు

దేవరపల్లి: సంక్రాంతి కోడి పందేలకు పందెం రాయుళ్లు సిద్ధమవుతున్నారు. పందెం కోళ్లను కొనుగోలు చేసి సిద్ధం చేస్తున్నారు. పుంజు రంగు, జాతిని బట్టి రేటు పలుకుతోంది. వ్యాపారులు కడప నుంచి పందెపు పుంజులను తీసుకువచ్చి దేవరపల్లిలో విక్రయిస్తున్నారు. వారం రోజులుగా పందెపు పుంజుల వ్యాపారం జోరుగా సాగుతోంది. పుంజు రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకూ రేటు పలుకుతోంది.

'సురక్ష'లో 466 మందికి వైద్యం


శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి తేజశ్రీ

నిడదవోలు: స్థానిక నెహ్రూనగర్ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. నెహ్రూనగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని 466 మంది రోగులకు వైద్యాధికారి ఈ.తేజశ్రీ నేతృత్వంలోని ముగ్గురు వైద్యుల బృందం వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. పురుషులు 216, మహిళలు 250, విద్యార్థులు 09, గర్భిణులు, పిల్లలు 09 మందికి వైద్య పరీక్షలు చేశారు. అలాగే ఈ వైద్య శిబిరంలో 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి ఈ.తేజశ్రీ పేర్కొన్నారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందుల కిట్లను పంపిణీ చేశారు.

పందేలకు దిగితే కటకటాలే..


దేవరపల్లిలో పందేలను నిషేధిస్తూ ఫెక్సీలు చూపుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

దేవరపల్లి: సంక్రాంతి పేరుతో దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లో కోడి పందేలు, గుండాట, స్కిల్ కాయిన్స్, మద్యం విక్రయాల వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఈబీ దేవరపల్లి సీఐ డి.సుధ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎస్ఈబీ జిల్లా అధికారి సోమశేఖర్ ఆదేశాల మేరకు ఈ మూడు మండలాల్లో జూదాలు నిర్వహించే వారిపై దాడులు జరిపేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. కాగా దేవరపల్లి మండలంలో కోడిపందేలు నిర్వహించే ప్రదేశాల రైతులకు అవగాహన కల్పించినట్టు తహసీల్దార్ ఎం.రామకృష్ణ తెలిపారు. పందేలు నిర్వహించే ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పోలింగ్ స్టేషన్ల తనిఖీ


పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శ్రీవాత్సవ, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి

చాగల్లు: మండలంలోని రెండు పోలింగ్ స్టేషన్లను కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాత్సవ, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. చాగల్లులో పోలింగ్ స్టేషన్ నంబర్–119, మల్లవరం పోలింగ్ స్టేషన్ నంబర్– 138ను వారు పరిశీలించారు. వికలాంగులు, వృద్ధులు ఇబ్బంది పడకుండా పోలింగ్ స్టేషన్‌లోకి వెళ్లేలా ర్యాంపులు నిర్మించాలని స్థానిక పోలింగ్ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో నిర్మలాకుమారి, బీఎల్‌వోలు వారి వెంట ఉన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, పడాల శిరీష

నిడదవోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్థానిక గాంధీనగర్‌లోని స్ప్రింగ్ బోర్డ్ స్కూల్లో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. రంగవల్లులను తీర్చిదిద్దడానికి పలువురు మహిళలు పోటీ పడ్డారు. ప్రథమ బహుమతిని వై.సుజాత, ద్వితీయ బహుమతిని సీహెచ్ స్వర్ణ, తృతీయ బహుమతిని ఎ.మౌనిక గెలుచుకున్నారు. కౌన్సిలర్లు కొత్తపల్లి సుప్రియ, ఆలమూరి భారతి, పడాల శిరీష విజేతలకు బహుమతులు అందజేశారు.

అవ్వాతాతల్లో పింఛనోత్సాహం

- ముందే వచ్చిన సంక్రాంతి
- రూ.3 వేల చొప్పున అందుకున్న లబ్ధిదారులు
- తాళ్లపూడి మండలంలో 8060 మంది లబ్ధిదారులు


తాళ్లపూడి మండలం బల్లిపాడులో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులు

తాళ్లపూడి: నెలవారీ పెన్షన్ సొమ్ము పెంపుతో అవ్వాతాతల కళ్లలో ఆనందం తొణికిసలాడుతోంది. వారి ఇంటికి సంక్రాంతి ముందే వచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో సరిగ్గా 2019 జనవరిలో సామాజిక పింఛను కేవలం రూ.1000 మాత్రమే అందేది. సరిగ్గా ఐదేళ్ల తర్వాత అంటే, 2024 జనవరిలో లబ్ధిదారులు నెలకు రూ.మూడు వేల చొప్పున పింఛను పొందుతున్నారు. నెలవారీ పెన్షన్ సొమ్ము పెరగడంతో తమకు ఆర్థిక భరోసా ఏర్పడిందని వృద్ధులు, వితంతువులు, వికలాంగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ ఖర్చుల కోసం ఇతరుల వద్ద చేయి సాచాల్సిన అవసరం ఇకపై తమకు లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామని అంటున్నారు. తాళ్లపూడి మండలంలో మొత్తం పెన్షనుదారులు 8,060 మంది. వారిలో ఈ నెల నుంచి కొత్తగా పెన్షన్లు మంజూరైన వారు 189 మంది. ప్రతి నెలా పెన్షన్ రూపంలో మండల వాసులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.23,56,500 చెల్లిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయంలో మండలంలో కేవలం 6,553 మందికి మాత్రమే పెన్షన్ అందేది. దానికి కూడా రోజుల తరబడి కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది.

కొవ్వూరు నియోజకవర్గంలో మండలాల వారీగా పెరిగిన పింఛనుదారులు

మండలం	టీడీపీ ప్రభుత్వంలో	ప్రస్తుత ప్రభుత్వంలో
కొవ్వూరు	8430	14,605
తాళ్లపూడి	6553	8060
చాగల్లు	7606	9733

(వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, కల్లుగీత కార్మికులు, కళాకారులు లబ్ధి పొందుతున్నారు)

మాలాంటి పేదలకు మేలు



ఏ ఆసరా లేని మాలాంటి పేదలకు వైఎస్సార్ పింఛన్ పథకం ఎంతో మేలు చేస్తోంది. ఈ నెల నుంచి నెలకు రూ. 3 వేల చొప్పున వృద్ధాప్య పింఛన్ అందిస్తున్నారు. చాలా ఆనందంగా ఉంది. ఎన్నికల్లో జగన్‌బాబు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఆయనకు పేదల కష్టాలు తెలుసు.

–దొండపాటి వెంకటరావు, అన్నదేవరపేట

కొత్తగా పింఛన్ తీసుకున్నాను



మా ఇంటికి వలంటీర్ స్వయంగా వచ్చి 'గత నెలలో మీరు వికలాంగ పెన్షన్‌కు దరఖాస్తు చేశారు. ఈ నెలలో పెన్షన్ మంజూరైంది' అని చెప్పారు. చాలా సంతోషం వేసింది. మొదటిసారి పింఛను సొమ్ము అందుకున్నాను. ఎవరి చుట్టూ తిరగకుండానే ఇదంతా జరిగింది.

–ఇందుగుల దుర్గామల్లేశ్వరి, వేగేశ్వరపురం

నేను టీడీపీ అయినప్పటికీ..



నేను టీడీపీలో ఉన్నాను. అయినా నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేశారు. నేను అధికార వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా లేకపోయినా వలంటీర్ ద్వారా ప్రభుత్వం పింఛన్ ఇచ్చింది. గత ప్రభుత్వంలో అధికారుల చుట్టూ తిరిగితే గాని పెన్షన్ వచ్చేది కాదు.

–అగుర్తి రామారావు, అన్నదేవరపేట

జగన్‌బాబు చల్లగా ఉండాలి



జగన్ మా లాంటి వృద్ధులకు పెద్ద కొడుకుగా మారి వృద్ధాప్య పింఛన్ రూ. 3 వేలకు పెంచారు. అంతేకాదు ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్లే ఇంటికి వచ్చి మరీ పెన్షన్ సొమ్ము ఇస్తున్నారు. అంతేకాకుండా బియ్యం, రేషన్ కూడా ఇంటికే తెచ్చి ఇస్తున్నారు. గతంలో ఇబ్బందులు పడాల్సి వచ్చేది. ఇప్పుడు మాకు ఎటువంటి ఇబ్బందీ లేదు.

–వలవల సత్యవతి, అన్నదేవరపేట

వితంతు పెన్షన్ వస్తోంది



నేను ఏ ఆఫీసుకూ తిరగకుండానే వలంటీర్ వచ్చి వితంతు పెన్షన్ రాశారు. జగన్ ప్రభుత్వం మంజూరు చేసింది. మొదటి పింఛను రూ.3 వేలు అందుకున్నాను. కుటుంబానికి ఆసరాగా ఉంది. ఎవరిపైనా ఆధార పకుండా కుటుంబాన్ని పోషించుకోవడానికి భరోసా కల్పించారు. మనసున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి.

–పిల్లి ప్రభావతి, వేగేశ్వరపురం

మంత్రికి రామమందిర ప్రారంభోత్సవ ఆహ్వానం


మంత్రి వనితకు ఆహ్వాన పత్రం అందిస్తున్న పండితులు

కొవ్వూరు: ఈ నెల 22న అయోధ్యలో నిర్వహించే రామ మందిరం ప్రారంభోత్సవానికి ఆహ్వానిస్తూ రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు బుధవారం స్థానిక పండితులు ఆహ్వాన పత్రం, పూజా అక్షతలు అందజేశారు. ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం బృందం పట్టణంలోని క్యాంపు ఆఫీసులో మంత్రిని కలిసి ఆహ్వానపత్రం అందించారు. వేద పండితులు ఆమెను ఆశీర్వదించి, సత్కరించారు. శ్రీరామా సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, ఆంధ్ర గీర్వాణ విద్యాపీఠం కార్యదర్శి టీఎస్‌వీ రమణమూర్తి, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, జీబీవీ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా జీవన ప్రమాణ పత్రాలు

నల్లజర్ల: రిటైర్డు ఉద్యోగులకు ఉచితంగా జీవన ప్రమాణ పత్రాలు తయారు చేసి ఇస్తున్నట్టు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఐవీ సత్యం తెలిపారు. రిటైర్డు ఉద్యోగుల సంఘ సమావేశం నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో జరిగింది. సంఘాధ్యక్షుడు సత్యం మాట్లాడుతూ నెక్కలపూడి ప్రతాప్ ఆధ్వర్యంలో ఇక్కడే రిటైర్డ్ ఉద్యోగుల వేలిముద్రలు తీసుకొని జీవన ప్రమాణ పత్రాలు తయారు చేసి ఇస్తున్నామన్నారు. ప్రభుత్వ పెన్షనర్లకు వెంటనే కరవు భత్యం, పీఆర్సీ బకాయిలు చెల్లించాలని వారు విజ్ఞప్తి చేశారు.

'జలకళ'తో మెట్ట సస్యశ్యామలం

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- 24 మంది రైతులకు బోరు మోటార్ మెటీరియల్ అందజేత


రైతులకు ఉచితంగా బోరు మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: మెట్ట భూములకు నీటిని అందించే లక్ష్యంతో ప్రభుత్వం వైఎస్సార్ జలకళ పథకాన్ని అమలు చేస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం ఎంపీడీఓ కార్యాలయంలో అర్హులైన 24 మంది రైతులకు ఉచితంగా బోరు మోటార్ మెటీరియల్‌ను ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జలకళ ద్వారా ఉచితంగా బోర్లు వేసి సన్న,చిన్నకారు రైతులకు అండగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ , ఎంపీటీసీ సభ్యుడు బయ్యే కృష్ణబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమళ్ల దుర్గారావు, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, ఎంపీడీఓ పి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వేపనూనె పిచికారీతో తెల్లదోమ నివారణ


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

చాగల్లు: వేప నూనె పిచికారీతో ఉద్యాన పంటలను ఆశించే తెల్లదోమ (రూగోస్) తెగులును సమర్థవంతంగా అరికట్టవచ్చని అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో తెల్లదోమ తెలుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై మండలంలో కలవలపల్లి గ్రామంలో బుధవారం రైతులకు వారు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం శాస్త్రవేత్తలు కలవలపల్లి, చిక్కాల గ్రామాల్లో పొలాలకు వెళ్లి ఈ తెగులు ఆశించిన తోటలను పరిశీలించారు. సదస్సులో జిల్లా ఉద్యాన అధికారి సుజాత, అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు చలపతి, జనార్దన్, సునీత, 3 ఎఫ్ ఆయిల్ కంపెనీ మేనేజర్ భద్రరావు, ఉప సర్పంచ్ కొండేపాటి హరినాథ్, రైతులు ముళ్లపూడి మురళి, ఉద్యాన శాఖాధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నన్నయ యూనివర్సిటీ కిక్ బాక్సింగ్ జట్టు ఎంపిక


ఎంపిక పోటీల్లో తలపడుతున్న కిక్ బాక్సర్లు

నిడదవోలు: నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో కిక్ బాక్సింగ్ జట్టు ఎంపిక పోటీలను బుధవారం పట్టణంలోని ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 8 మంది కిక్ బాక్సర్లు పోటీలకు హాజరయ్యారు. వారిలో ఎం..రవి, బి.అర్జున్, బి. ప్రవీణ్‌కుమార్, సీహెచ్ వెంకట్, బి.రవితేజ, పి.ధనుష్, సీహెచ్ దినేష్‌లు నన్నయ యూనివర్సిటీ జట్టుకు అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి తెలిపారు. అర్హత సాధించిన కిక్ బాక్సర్ల జట్టు మీరట్‌లోని స్వామి వివేకానంద సుభార్తి విశ్వవిద్యాలయంలో త్వరలో నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల కిక్ బాక్సింగ్ పోటీల్లో నన్నయ్య యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

వారు దోచుకుంటే.. మేం అభివృద్ధి చేశాం

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- ఖండవల్లిలో రెండో రోజూ గడప గడపకూ..


ఖండవల్లిలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: గత పాలకులు నిడదవోలు నియోజకవర్గాన్ని అందినకాడికి దోచుకుంటే, తాము మాత్రం దాదాపు రూ.రెండు వేల కోట్లతో అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని ఖండవల్లి గ్రామంలో రెండో రోజు బుధవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పని చేసినా ఇక్కడి టీడీపీ, జనసేన నాయకులు రాజకీయం చేస్తున్నారన్నారు. దయచేసి వారి మాటలు నమ్మవద్దని గ్రామస్తులను కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఏ ఒక్కరికైనా సెంటు ఇంటి స్థలం ఇచ్చారా? అని ప్రశ్నించారు. తాము అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే వంకలు పెడుతున్నారని అన్నారు. ఈ గ్రామంలో జనసేన, టీడీపీలు రెండూ ఒక్కరి చేతిలోనే ఉన్నాయని, వారి ఉనికి కోసమే ఇలా రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. వేల కోట్లు వెచ్చిస్తుంటే ఈ గ్రామంలో విపక్షాలు అభివృద్ధిని అడ్డుకోవడానికి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నాయన్నారు. ఇదీ ప్రతి పక్షాలకు పేదల మీద ఉన్న ప్రేమ అంటూ వ్యాఖ్యానించారు. ఇసుక, మట్టి అమ్ముకుని జేబులు నింపుకున్న చరిత్ర తెలుగుదేశం నాయకులదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల, గ్రామ శాఖల అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ, కందా వెంకన్న, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రబీ వరి నాట్లలో అన్నదాతలు బిజీ

- నిడదవోలు నియోజకవర్గంలో 36,500 ఎకరాల్లో సాగు
- ఇప్పటికే 60 విస్తీర్ణంలో పూర్తయిన నాట్లు


చివటంలో దాళ్వా వరినాట్లు వేస్తున్న బెంగాలీ కూలీలు

ఉండ్రాజవరం: దాళ్వా సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా దమ్ములు, నాట్లు వేసే పనుల్లో రైతులు, కూలీలు బిజీగా కనిపిస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో ఈ ఏడాది 36,500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు రబీ వరి సాగు చేపట్టారు. మండలాల వారీగా ఉండ్రాజవరంలో 11,500, నిడదవోలులో 16,500, పెరవలిలో 8,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే ఈ మూడు మండలాల్లో 60 శాతం విస్తీర్ణంలో వరినాట్లు పూర్తయ్యాయి. మిగిలిన 40 శాతం విస్తీర్ణంలో చకచకా నాట్లు వేస్తున్నారు.

ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు ఎక్కువగా ఎంటీయూ 1121, పీఆర్ 126 రకం వరి వంగడాలను సాగు చేస్తున్నారు. సంక్రాంతి పండగ నాటికి 100 శాతం నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రబీ నాట్లు వేసే వరకూ ఎకరానికి సుమారు రూ.8 వేల వరకూ ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు.

నియోజకవర్గంలో వ్యవసాయ కూలీల కొరత ఉంది. అయితే బెంగాల్ ప్రాంతం నుంచి వ్యవసాయ కూలీల రాకతో రైతులకు ఆ సమస్య తీరింది. నియోజకవర్గంలో 80 శాతం రైతులు బెంగాల్ కూలీలతోనే రబీ పనులు చేయిస్తున్నారు. వరినారు తీతకు, నాట్లు వేయడానికి ఎకరానికి బెంగాల్ కూలీలు రూ.3,800 చొప్పున తీసుకుంటున్నారు. ఈ రేటు రైతులకు కూడా వెలుసుబాటుగా ఉంది. ముఖ్యంగా బెంగాల్ కూలీలతో నాట్లు వేయిస్తే అధిక పంట దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు విజయవాడ తరలిరండి

నల్లజర్ల: ఈనెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించే 125 అడుగుల ఎత్తైన బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మానవతావాదులు, అంబేడ్కర్ వాదులందరూ హాజరు కావాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ జిల్లా సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు కోరారు. ఆ సంఘ యూత్ అధ్యక్షుడు బాబు అధ్యక్షతన బుధవారం నల్లజర్లలో నిర్వహించిన సమావేశానికి మంగరాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని నిబద్ధతతో అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పాలనలో ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం జగన్ అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సామాజిక న్యాయం పాటిస్తున్నారన్నారు. దళితులపై వివక్ష చూపే చంద్రబాబు కల్లబొల్లి మాటలను ఎవరూ నమ్మవద్దని మంగరాజు కోరారు. సమావేశంలో వీరవల్లి సునీల్‌బాబు, చవ్వాకుల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రక్కిలంకలో పారిశుధ్య పనులు

తాళ్లపూడి: ప్రక్కిలంకలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. సంక్రాంతి పండగ సందర్భంగా గ్రామస్తులు దోమలతో ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సర్పంచ్ యాళ్ల స్వప్న ఆదేశాల మేరకు ఈ పనులు నిర్వహించారు. డ్రెయిన్లలో పూడిక తొలగించి, దోమల నివారణ మందును పిచికారీ చేశారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు యాళ్ల బాబురావు పనులను పర్యవేక్షించారు.

క్రీడల్లో ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- పలు ప్రాంతాల్లో మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొంటున్న క్రీడాకారులు


నిడదవోలులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు


దేవరపల్లి ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఖోఖో ఆడుతున్న పురుషుల జట్లు


నల్లజర్లలో కబడ్డీ ఆడుతున్న పురుషుల జట్లు


వేగేశ్వరపురంలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీవో, సర్పంచ్, ఎంఈవోలు

నిడదవోలు: యువతలోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు, వారిలో క్రీడా స్ఫూర్తిని నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు కోరారు. పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న ఆడుతా ఆంధ్రా నిడదవోలు పట్టణ, మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. తొలుత ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వాలీబాల్ సర్వీస్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ పట్టణ పరిధిలోని 13 సచివాలయాలు, మండలంలోని 22 సచివాలయ పరిధిలో కబడ్డీ, ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులకు కూడా నగదు బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, ఎంపీడీవో పి.శామ్యూల్, ప్రత్యేకాధికారి ఎ.స్వాతి, ఎంఈవోలు గణేష్, గురుమూర్తి, ఎంపీపీ భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు ఎస్కే వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, ఎండీ షకీరాబేగం, అహ్మదున్నీసా బేగం పాల్గొన్నారు.

దేవరపల్లి: స్థానిక ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలను మండల ప్రత్యేకాధికారి జి.రాధాకృష్ణ ప్రారంభించారు. తొలిరోజు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో విభాగాల్లో పోటీలు జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ క్రీడాకారులతో పాఠశాల మైదానం సందడిగా మారింది. మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చాటారు. మూడు రోజుల పాటు పోటీలు జరుగుతాయని ఎంపీడీఓ డీబీఆర్ కృష్ణంరాజు తెలిపారు. ఈ నెల 17,18,19 తేదీల్లో బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు జరుగుతాయన్నారు.

నల్లజర్లలో..

నల్లజర్ల: ఉత్సాహం ఉరకలెత్తేలా ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి ఆటల పోటీలు నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ మైదానంలో బుధవారం ప్రారంభం అయ్యాయి. ఎంపీడీఓ రాజశేఖర్ పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్ , ఖోఖో విభాగాల్లో పోటీలు నిర్వహించగా 16 టీములు పాల్గొన్నాయి. కార్యక్రమంలో నల్లజర్ల సొసైటీ చైర్మన్ కారుమంచి రమేష్, తెలికిచెర్ల, జగన్నాథపురం, అయ్యవరం సర్పంచులు బండి చిట్టి, చెల్లారి రామశ్రీనివాస్, గుడిశే వీరాస్వామి, నక్కా పండు, నీరుకొండ జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం మండలంలోని వేగేశ్వరపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, ఎంఈవో సీహెచ్ బాలామణి, ఎంఈవో-2 సీహెచ్ నెహ్రూజీ, ఎంపీడీవో వెంకటరమణ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, వ్యాయామోపాధ్యాయులు పాల్గొన్నారు.